ప్రజాశక్తి

సోమవారం 17 జులై 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నిరాశాజనకంగా జలాశయాలు

◆ వర్షాల్లేక తగ్గిన నీటి నిల్వలు ◆ ఆలస్యంగా సాగునీరు విడుదల

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో జలాశయాల నీటిమట్టాలు తక్కువగా వున్నాయి. జలాశయాల పైభాగంలో వర్షాల్లేక నీటిప్రవాహాలు తగ్గుముఖం పట్టాయి. దీనివల్ల ఖరీఫ్‌కు సకాలంలో నీరు విడిచిపెట్టలేని పరిస్థితి ఏర్పడింది. గతేడాది ఇదే సమయానికి తాండవ జలాశయం నీటిని నీటిపారుదల శాఖాధికారులు విడిచిపెట్టారు. ఈ ఖరీఫ్‌కు వరహా మినహా మిగిలిన జలాశయాల్లో నీటి నిల్వలు ఆశించినంతగా లేవు. ఇతర జలాశయాల కంటే కొంత మెరుగ్గావున్నప్పటికీ వరహాలోనూ పూర్తిస్థాయి నీటి నిల్వలు సామర్థ్యానికి తగినంతలేవు. వర్షాలు సరిగా లేకపోవడంతో ఆకుమడులను రైతులు తయారుచేసుకోలేకపోయారు. జిల్లాలో ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం 1.30 లక్షల ఎకరాలకు తాండవ, రైవాడ, కోణాం, వరహా, పెద్దేరు జలాశయాల కింద 52,074 ఎకరాలు సాగవుతోంది. గతేడాది జలాశయాల నీటి నిల్వలు బాగుండడంతో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ పాటికే నీరు విడిచిపెట్టారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో తాండవ నీటిని ఆగస్టు మొదటి వారంలో విడిచి పెట్టాలన్న ఆలోచనలో నీటిపారుదల శాఖాధికారులున్నారు. జిల్లాలో తాండవ కింద 32,689 ఎకరాలు, రైవాడ కింద 15,344 ఎకరాలు, కోణాం కింద 12,276 ఎకరాలు, వరహా కింద 4,485 ఎకరాలు, పెద్దేరు కింద 19,969 ఎకరాల ఆయకట్టు వుంది.



తాండవ జలాశయం

జలాశయాల నీటిమట్టాల వివరాలు

జలాశయం	ఎఫ్ఆర్ఎల్	జులై 15 నాటికి	గతేడాది ఇదే సమయానికి
తాండవ	380	369.10	375.10 (అడుగులు)
రైవాడ	114	108.20	111.30 (మీటర్లు)
కోణాం	101	95.60	97.60 (మీటర్లు)
వరహా	460	450	456.10 (అడుగులు)
పెద్దేరు	137	134.90	136.60 (మీటర్లు)

ధర్మశ్రీపై సిఎం సీరియస్..!

◆ ఆరోపణలు, అసంతృప్తులపై ఆరా

◆ మరికొద్ది రోజుల్లో యలమంచిలి ఎమ్మెల్యేకు పిలుపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అధికార పార్టీ నాయకుల వ్యవహారశైలి పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సీరియస్‌గా వున్నట్లు తెలుస్తోంది. విశాఖపట్నం జిల్లా వైసిపి అధ్యక్ష పదవికి పంచకర్ల రమేష్‌బాబు రాజీనామా తరువాత నాయకత్వ లోపాలను సరిదిద్దే పనిని సిఎం తీసుకున్నారన్న ప్రచారం పార్టీలో జరుగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలతో సన్నిహితంగా వుండకుండా, వారిపై దురుసుగా ప్రవర్తించిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరినీ ఆయన పిలిపించుకుంటున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొన్నిచోట్ల ప్రజల నుంచి వ్యతిరేకత, అసంతృప్తి, ఆరోపణలు ఎదుర్కొన్న ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని అమరావతికి రమ్మన్నట్లు తెలిసింది. సోమవారం ఉదయం 9 గంటలకు అపాయింట్‌మెంట్ ఇవ్వడంతో ఆదివారం రాత్రి అమరావతికి ధర్మశ్రీ బయలుదేరివెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకూ వచ్చిన ప్రతి ఆరోపణా, అసంతృప్తులకూ కారణాలను సిఎం అడిగి తెలుసుకోనున్నారు. మంత్రి పదవి ఇవ్వలేదని బాధపడ్డ ధర్మశ్రీకి ప్రభుత్వ విప్, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. కొంతకాలం పనిచేశాక అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించి, గవర కార్పొరేషన్ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు పార్టీ బాధ్యతలు అప్పజెప్పారు.



ధర్మశ్రీ (ఫైల్ ఫొటో)

పార్టీని బలోపేతం చేయడం కంటే తన సామాజిక తరగతికి ధర్మశ్రీ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్న సమాచారం సిఎంకు వుంది. దీనివల్ల నియోజకవర్గ స్థాయిలో నాయకత్వం మధ్య సమన్వయలేమి, అంతర్గత సమస్యలు, అసంతృప్తులు బలపడు తున్నాయన్న ఫిర్యాదులు అధిష్టానం దృష్టికి వెళ్లాయి. తన సామాజిక తరగతిని కూడగట్టడం వెనుకవున్న భవిష్యత్ వ్యూహాన్ని పై నాయకత్వం మిగతా 2లో..

ఫార్మా కంపెనీల్లో భద్రతపై దృష్టి

◆ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ◆ అగ్ని ప్రమాదాల నివారణకు కృషి

◆ 'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకటరమణ





ప్రజాశక్తి - **అనకాపల్లి** : జిల్లాలో అగ్ని ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని, ముఖ్యంగా ఫార్మా కంపెనీల్లో భద్రతపై దృష్టి పెట్టామని అనకాపల్లి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రుత్తల వెంకటరమణ అన్నారు. ఇటీవల పరిశ్రమల్లో జరుగుతున్న భారీ అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ, యాజమాన్యాలు చేపట్టాల్సిన భద్రతా చర్యలు, అలాగే ఆసుపత్రులు, సినిమా థియేటర్లు, పాఠశాలలు, కళాశాలల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను 'ప్రజాశక్తి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పరిశ్రమల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై తీసుకుంటున్న చర్యలేంటి ?

ఇటీవల జిల్లాలోని ఫార్మా సిటీలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా లారస్, సాహితీ ఫార్మా కంపెనీల్లో భారీ ప్రమాదాలు జరిగాయి. కేవలం సిబ్బంది అవగాహన లోపం వల్లే ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇక సాధారణ అగ్ని ప్రమాదాల్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, గ్యాస్, గడ్డివాముల దగ్ధం వంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఫార్మా కంపెనీలో సేఫ్టీ నిబంధనలను తరుచూ పరిశీలిస్తున్నాం. నెలకు మూడు రోజులపాటు అక్కడ సిబ్బందికి మిగతా 2లో..

స్ఫూర్తిదాయకం.. 'ఉక్కు' పరిరక్షణ పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని చేపట్టిన ఉద్యమం మరో స్వాతంత్ర్య పోరాటం వంటిదని విశాఖ మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు అన్నారు. ఈ పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగుతోందని తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలేదీక్షలు ఆదివారానికి 836వ రోజుకు చేరాయి. దీక్షల్లో విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజల ఆస్తులైనటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లో పెట్టే ప్రయత్నం ఇప్పుడున్న బిజెపి ప్రభుత్వం చేస్తోందని అన్నారు. ఇప్పటికే అనేక రకాలుగా ప్రభుత్వ సంపదను వాళ్లకు కట్టబెట్టారని గుర్తు చేశారు. రాష్ట్రానికే తలమానికమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూములను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ధర్మశ్రీపై సిఎం సీరియస్..!

పసిగట్టింది. ఈ పరిణామాలన్నీ జరుగుతున్న నేపథ్యంలో ధర్మశ్రీని పిలిపించి మాట్లాడాలన్న నిర్ణయానికి సిఎం వచ్చినట్లు సమాచారం. యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు వ్యవహారశైలి పట్ల సిఎం అసంతృప్తితో వున్నట్లు తెలిసింది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు చెప్పిన జనంపై దురుసుగా ప్రవర్తిస్తున్న ఆ ఎమ్మెల్యేపై నియోజకవర్గ వైసిపి నాయకులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే వ్యవహారశైలితో ఇప్పటికే పార్టీకి నష్టం జరిగిందని, ఇప్పటికైనా ఆయనలో మార్పురాకపోతే పూడ్చలేని నష్టం వాటిల్లుతుందని నియోజకవర్గ నాయకులు మాట్లాడుకోవడం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగకుండా కొద్ది రోజుల్లో రమణమూర్తిరాజును కూడా సిఎం పిలిచి మాట్లాడనున్నట్లు జిల్లాలోని పార్టీ ప్రధాన నాయకులు చెప్పుకుంటున్నారు.

ఫార్మా కంపెనీల్లో భద్రతపై దృష్టి

శిక్షణ ఇస్తున్నాం.

జిల్లాలో అగ్నిమాపక దళ స్టేషన్ల గురించి తెలియజేయండి ?

అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, మాడుగుల, చోడవరం, సబ్బవరంలతోపాటు రావికమతం, నక్కపల్లి మండలాల్లో రెండు అవుట్ సోర్సింగ్ స్టేషన్లు ఉన్నాయి.

సొంత భవనాలు, మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి ?

మొత్తం అన్ని అగ్నిమాపక స్టేషన్లకూ సొంత భవనాలున్నాయి. సిబ్బంది కొరత లేదు. ప్రతి స్టేషన్‌కూ 15 మంది చొప్పున సిబ్బంది పనిచేస్తున్నారు. వాహనాలు అన్ని స్టేషన్లకూ ఉన్నాయి.

థియేటర్లు, ఆసుపత్రులు, విద్యాలయాలు అగ్నిమాపక నిబంధనలు పాటిస్తున్నాయా ?

అనకాపల్లి పట్టణం వరకూ వీటి స్థితిని జివిఎంసి పరిశీలిస్తుంది. అలాగే జిల్లాలో మిగిలిన చోట్ల మా అగ్నిమాపక దళ సిబ్బంది ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నారు. నేషనల్ బిల్డింగ్ కోడ్ 2016 ప్రకారం ఆసుపత్రులు, థియేటర్లు, కళాశాలలను ఎత్తు, ఏరియా, బెడ్డెడ్, నాన్ బెడ్డెడ్ గైడ్‌లైన్స్ ప్రకారం ఎప్పటికప్పుడు పరిశీలించి కేసులు నమోదు చేస్తున్నాం.

పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ ఎలా జరుగుతోంది ?

పరిశ్రమల్లో కలెక్టర్ ఛైర్మన్‌గా జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పరిశ్రమలను తనిఖీ చేసి నివేదికను పంపిస్తున్నారు. 2022లో 180 పరిశ్రమలను తనిఖీ చేసి నివేదికను పంపాం.

ఈ సంవత్సరం ఎన్ని ప్రమాదాలు జరిగాయి ?

ఈ సంవత్సరం జిల్లాలో ఏప్రిల్ నుంచి ఇంత వరకు 150 ప్రమాదాలు జరిగాయి. వాటిలో భారీ ప్రమాదాలు 5 (రూ.10 లక్షలు కంటే ఎక్కువ నష్టం జరిగినవి), మధ్యంతర ప్రమాదాలు 5 (రూ.రెండు లక్షల నుంచి రూ.పది లక్షల వరకూ ఆస్తి నష్టం), 140 చిన్న ప్రమాదాలు (రెండు లక్షల రూపాయల లోపు ఆస్తి నష్టం) జరిగాయి. అలాగే 12 రెస్క్యూ ప్రమాదాలు జరిగాయి.



దీక్షల్లో కూర్చున్న ఆటో రిక్షా కార్మిక సంఘం కార్యకర్తలు

స్ఫూర్తిదాయకం.. 'ఉక్కు' పరిరక్షణ పోరాటం

కాజేయచూస్తున్నారని విమర్శించారు. ఈ కుట్రను ఇప్పటికే ప్రజలు తెలుసుకొని పెద్ద ఎత్తున ఉద్యమాల్లో పాల్గొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, గణేష్, శ్రీను, పైడిరాజు, సోంబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

పోర్టుల్లో సంక్షేమంపై సమావేశం

ప్రజాశక్తి - ఎంవిపి. కాలనీ : మేజర్ పోర్టులు, ఫెడరేషన్ల మధ్య నాలుగో ద్వైపాక్షిక చర్చల కమిటీ సమావేశం విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం జరిగింది. విశాఖపట్నం పోర్టు అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్ని మేజర్ పోర్టుల ఛైర్మన్లకు, ఫెడరేషన్ల ప్రతినిధులకు సాదర స్వాగతం పలికారు. ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్ (ఐపిఎ) ఛైర్మన్ నేతృత్వం వహించిన ఈ సమావేశంలో క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగులకు సంబంధించిన వేతన సవరణ అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు విశాఖపట్నం పోర్టులో ఉద్యోగులకు అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

అమరేష్‌కు ఆశ్రయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కొద్ది రోజుల క్రితం 50 ఏళ్ల వయసుగల వ్యక్తి సంగం, శరత్ థియేటర్‌కు ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై పడి ఉండగా అతనిని ఎయుటిడి సిబ్బంది గుర్తించి నగరంలోని మెంటల్ కేర్ ఆసుపత్రిలో చికిత్స అందించగా తాజాగా కోలుకున్నాడు. ఆసుపత్రి నుంచి రికవరీ సమాచారం అందడంతో ఎయుటిడి, టిఎస్‌ఆర్ నిరాశ్రయుల వసతి గృహం సిబ్బంది అక్కడకు వెళ్లి అతన్ని తీసుకువచ్చి వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. కోలుకున్న ఆయన తన పేరు అమరేష్ అని చెప్పారని నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకుడు ప్రగడ వాసు తెలిపారు. కొద్ది రోజులు ఇక్కడ ఉంచి పూర్తిస్థాయిలో ఆయన కోలుకున్న తర్వాత వారి బంధువులకు అప్పగిస్తామన్నారు.

ఉత్సాహంగా విసిసి చదరంగం పోటీలు



పోటీల్లో తలపడుతున్న చిన్నారులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రపంచ చదరంగం దినోత్సవం సందర్భంగా ఆదివారం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించారు. విసిసి ప్రతి సంవత్సరం ఈ పోటీలను క్లబ్, జోన్, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. తాజా పోటీల్లో 56 మంది పాల్గొన్నారు. వీరిలో ఆరుగురు విన్నర్స్, ఆరుగురు రన్నర్స్‌గా నిలిచారు. వీరికి అతిథులు బహుమతులు అందించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లాలో మధురవాడ, జగదాంబ, కంచరపాలెం, మద్దిలపాలెం, గాజువాక, బాలయ్య శాస్త్రి లేవుట్ ప్రాంతాల నుంచి చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రొటేరియన్ మోదంబికా దేవి మాట్లాడుతూ చెస్ ఆడడం ద్వారా పిల్లలలో కాన్సెంట్రేషన్, లాజిక్, చురుకుదనం పెరుగుతాయని తెలిపారు. ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విసిసి పిల్లల కోసం నిరంతరం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. విసిసి ఫౌండర్ కె.రమాప్రభ మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో ఆటలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. ఎల్ఐసి ఉద్యోగి, చెస్ కోచ్ చాగంటి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ 15 రోజులుపాటు తన వద్ద చిన్నారులు శిక్షణ పొందారన్నారు. చెస్ పట్ల చాలా ఆసక్తి చూపారని తెలిపారు. సేవా సంస్థ ఫౌండర్, చెస్ కోచ్ కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ ఓటమి గెలుపునకు పునాదివంటిదన్నారు. కార్యక్రమంలో విసిసి ఆర్గనైజర్లు మణి, డి.జగదీష్, ఆర్.నిఖిల్, జగదాంబ జోన్ కన్వీనర్ ఎల్లాజీ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో చిన్నారులు

యుజిడి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విజయవాడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మెయిన్ హోల్ శుభ్రం చేస్తుండగా మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నగరంలో యుజిడి కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విశాఖపట్నం యుజిడి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఇ.ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చనిపోయిన కార్మికుని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం, పర్మినెంట్ ఉద్యోగం, ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యుజిడి కార్మికులకు సేఫ్టీ పరికరాలు ఇవ్వకపోవడం వల్లే కార్మికులు ఇలా మరణిస్తున్నారని తెలిపారు. లైఫ్ రిస్క్‌తో కూడిన యుజిడి పనులు చేస్తున్న కార్మికులకు స్కిల్డు వేతనాలు, హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిన్నమ్మలు, నరేష్, బద్రి, బాబూరావు పాల్గొన్నారు.



నగరంలో నిరసన తెలుపుతున్న యుజిడి కార్మికులు

న్యాయం చేయాలి

విజయవాడలో మ్యాన్‌హోల్ వద్ద పనిచేస్తుండగా మరణించిన కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కవితల పోటీకి గడువు పెంపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కార్యదర్శిగా వ్యవహరించిన నూనెల శ్రీనివాసరావు తృతీయ వర్ధంతి సందర్భంగా ఈ నెల 22న అభ్యుదయ కవితలు, మినీ కవితల పోటీని నిర్వహిస్తున్నామని పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ పెంటకోట రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కవితలను పంపే గడువును ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఔత్సాహిక యువ కవులు, కవయిత్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రథమ ఉత్తమ కవితకు రూ.2 వేలు, ద్వితీయ ఉత్తమ కవితకు రూ.1,500, తృతీయ ఉత్తమ కవితకు రూ.1000 నగదు బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. కవితలను ఇ-మెయిల్ ద్వారా sahithisravan-thivisakha@gmail.comకు, వాట్సప్ ద్వారా 8247797303, 9490099222 నెంబర్లకు పంపాలని విజ్ఞప్తి చేశారు.

వైసిపికి మహిళల పట్ల గౌరవం కరువు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపికి మహిళల పట్ల ఎటువంటి గౌరవమూ లేదని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ టిడిపి అడుగుతున్న ప్రశ్నలకు వైసిపి సమాధానాలు చెప్పలేకపోతోందని అన్నారు. ఇతర పార్టీల మహిళలను కించ పరిచేలా ఆ పార్టీ నేతలు వాఖ్యలు చేస్తున్నారన్నారు. మద్యపాన నిషేధం ఎప్పుడు చేస్తారో చెప్పమంటే చెప్పలేరన్నారు. పైగా స్త్రీ జాతి వినలేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. తనపై అత్యంత హేయమైన వ్యాసాలు రాసి బాధ పెడుతున్నారని, నోటికి వచ్చిన దారుణమైన పదజాలం వినియోగిస్తున్నారని తెలిపారు. సిఎం సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు సజ్జల భార్గవరెడ్డి సోషల్ మీడియాలో రాతలు రాయిస్తున్నారని చెప్పారు. ఒక ఆడబిడ్డ మీద ఇలాంటి రాతలు ఎలా రాస్తారని ప్రశ్నించారు. ఈ విషయాల మీద ఫిర్యాదుకు డిజిపి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. సిఎంను ప్రశ్నించడమే తాను చేసిన తప్పా అని అడిగారు.



మాట్లాడుతున్న అనిత

చదువుకున్న దళిత ఆడబిడ్డనైన తనకు చంద్రబాబు ఎంతో అండగా నిలిచారని తెలిపారు. మహిళా సమస్యలపై తాము పోరాటం చేస్తుంటే వైసిపి సోషల్ మీడియా గజ్జి కుక్కలా మొరుగుతోందని అన్నారు. సమావేశంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, నాయకులు కేదారి లక్ష్మి, ఈతలపాక సుజాత, గణగళ్ల సత్య, తోట శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

టిడిపి మాజీ కార్పొరేటర్ ఆక్రమణ

ప్రజాశక్తి -పిఎం.పాలెం : విశాఖ రూరల్ మండలం మధురవాడలో టిడిపి మాజీ కార్పొరేటర్ ఆక్రమాలకు అంతు లేకుండా పోతోంది. ఆక్రమణల్లో ఆరితేరిన ఈ నాయకుడు తాజాగా ఓజోన్ వ్యాలి లే-అవుట్‌ను ఆనుకుని మారికవలస గ్రామానికి ఇవతలి వైపు పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 121, 122లో సుమారు 500 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించాడు. మార్కెట్ వాల్యూ ప్రకారం దీని విలువ రూ.2 కోట్లు పైమాటే. ఇందులో 4 కమ్మల పాకలు వేశాడు. ప్రభుత్వ భూమిని తన మిగులు భూమి అని కూడా ప్రచారం చేస్తున్నాడు. ఇందులో మేకలు, గొర్రెలు పెంపక కేంద్రాన్ని ఏర్పాటుచేశాడు. అంతటి ఆగకుండా ఒకటి తర్వాత ఒక్కటి షెడ్లు వేసుకుంటూ గెడ్డను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని అంచెలంచెలుగా ఆక్రమించేస్తున్నాడు. విఎంఆర్‌డిఎ గ్రీన్ బెల్ట్ ఏరియా అని రెవెన్యు అధికారులు చెపుతున్నారు. ఇంత జరుగుతున్నా సచివాలయ సిబ్బంది మాత్రం ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై తహశీల్దారు సనపల రమణయ్యను వివరణ కోరగా ఇది విఎంఆర్‌డిఎ గ్రీన్ బెల్ట్ ఏరియాకి చెందిన ప్రభుత్వ భూమి అని, ఆక్రమణ విషయాన్ని విఎంఆర్‌డిఎ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఓ పాకను తమ సిబ్బంది తొలగించారని, మిగిలినవి తొలగించేందుకు సదరు వ్యక్తి రెండు రోజులు సమయం కోరారని చెప్పారు.



ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

అమ్మేసిన స్థలం తిరిగి కబ్జాకు యత్నం

ప్రజాశక్తి - ఆరిలోవ : గతంలో అమ్మేసిన స్థలాన్ని తిరిగి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థల యజమాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి బాధితుడు తోట చంద్రరావు విలేకర్ల సమావేశం నిర్వహించి వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే... "సింహచలం ప్రాంతానికి చెందిన తోట చంద్రరావు గతంలో దారపాలెం ప్రాంతానికి చెందిన ఆల్తి అప్పారావు వద్ద సుమారు 1.96 ఎకరాల స్థలానికి జిపిఎ, స్వాధీన క్రయపత్రం రాయించుకున్నారు. ఆ స్థలాన్ని తోట చంద్రరావు ప్లాట్లుగా వేసి విక్రయించారు. ఇంకా మూడు ప్లాట్లు మిగిలి ఉన్నాయి. మూడింటిలో సుమారు 200 గజాల స్థలాన్ని ఆల్తి అప్పారావు వారసులమంటూ తిరిగి ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. తోట చంద్రరావు అప్పటికే ఆ స్థలంలో ప్రహరీ నిర్మించి, కంటైనర్‌ను ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో ఈ నెల 11న ఆల్తి అప్పారావు వారసులమని చెప్పుకుంటున్న ఎర్రా వరహానరసింహం, ఆల్తి వెంకటరమణ, రౌతు గురుమూర్తి, ఆల్తి లక్ష్మయ్య, ఆల్తి శంకరరావు, ఆల్తి రమణమ్మ, మరి కొంత మంది మద్దతుదారులతో కలిసి వచ్చి ప్రహరీని ధ్వంసం చేసి కంటైనర్‌ను అక్కడ నుంచి తొలగించారు." దీనిపై తోట చంద్రరావు ఆరిలోవ పోలీసులను ఆశ్రయించారు. ఇరువురు డాక్యుమెంట్లును పరిశీలించి రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేస్తామని పోలీసులు తెలిపారు. పూర్తి హక్కులు కలిగి తన ఆధీనంలో ఉన్న స్థలంలో ప్రహరీని, అందులో ఉన్న కంటైనర్‌ను ధ్వంసం చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని చంద్రరావు కోరారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి



భీమిలిలో ఆటో కార్మికుల ర్యాలీ...

ప్రజాశక్తి - భీమునిపట్నం : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు షేక్ రెహమాన్ డిమాండ్ చేశారు. స్థానిక ఎగువపేట పోలమాంబ ఆటో స్టాండ్ వద్ద ఆదివారం ఆటో కార్మిక సంఘం (ఎఐటియుసి) ఆధ్వర్యాన భీమిలిలో ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్వ సభ్య సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు రెహమాన్ మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఆటో, మోటారు రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. ఆటో డ్రైవర్ల తప్పొప్పులతో ప్రమేయం లేకుండానే ట్రాఫిక్ పోలీసులు ఫోటోలు తీసి ఆటో డ్రైవర్ల సెల్ ఫోన్లకు ఈ చలానా మెసేజ్‌లు పంపిస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది చాలదన్నట్లు జిఒ 21 వల్ల ఆటో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో డ్రైవర్లు ఏడాదికి వేలాది రూపాయలు చెల్లిస్తున్నారని, దాని నుంచి రాష్ట్ర ప్రభుత్వం సెస్ రూపంలో ఒక శాతం నిధిని కేటాయిస్తే ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయొచ్చని సూచించారు. రోజు వారీ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు అదుపు చేయాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాసుబాబు, జిల్లా నాయకులు కె.సింహాద్రి, డి.నూకరాజు, ఎస్.గురుమూర్తి, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-యంత్రాంగం

ములగాడ : మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే రౌడీషీటర్లకు, పాత నేరస్తులకు సిఐ జి.బాబు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, మంచి నడవడికతో ఉండాలని, ఎటువంటి నేరాలకు పాల్పడరాదని సూచించారు. నేరాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్, నగర బహిష్కరణ కూడా అమలుకు వెనుకాడబోమని స్పష్టంచేశారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే 9440796023 నెంబర్‌కు ఫోన్ చేస్తే సహాయమందిస్తామని తెలిపారు.

సీతమ్మధార : రౌడీలు క్రమశిక్షణతో మెలగాలని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సిఐ శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనవసర విషయాల్లో, వివాదాలు, సెటిల్‌మెంట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీలు బాధ్యతాయుతంగా పని చేసుకోవాలని ద్వారకా సిఐ సింహాద్రినాయుడు సూచించారు. సంఘవిద్రోహ చర్యలకు పూనుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భీమునిపట్నం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పలువురు రౌడీ షీటర్లను పిలిపించి ఆదివారం స్టేషన్లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనరాదని సిఐ డి.రమేష్ స్పష్టం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఏమైనా క్రిమినల్ చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సిఐ రమేష్‌తో పాటు ఎస్‌ఐలు భరత్‌కుమార్ రాజు, హరీష్, తాతారావు పాల్గొన్నారు

పిఆర్‌టియు మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : పిఆర్‌టియు మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అధ్యక్షునిగా రాజేంద్రప్రసాద్ (ఎంపిపి స్కూల్, ముద్దాడపేట), ప్రధాన కార్యదర్శిగా ఎస్.రమణారావు (ఎంపిపి స్కూల్, మజ్జివలస), ఉపాధ్యక్షులుగా అల్బర్ట్ సుదర్శన్, కోశాధికారిగా ఉదయ్ భాస్కర్ ఎన్నికైనట్లు యూనియన్ రాష్ట్ర కౌన్సిలర్ మురళీ మోహన్ రావు తెలిపారు. ఉపాధ్యాయులు గరికిన పరదేశి, గాడు మురళి, భాస్కరరావు, సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్ట్రీట్ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన చిన్న బజారులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి హోమియో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు టి.జగన్నాధరావు, టిజె.మోహన్ పలువురు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, పలువురు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు

సేవా కార్యక్రమాలకు శ్రీకారం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక వాస్తవ సేవా సంఘం ఆధ్వర్యాన త్వరలో పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు సంఘం అధ్యక్షులు పిట్టా సురేష్ తెలిపారు. కొత్తపేటలోని సంఘ కార్యాలయంలో ఆదివారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, సేవా కార్యక్రమాల్లో భాగంగా తొలి ప్రాధాన్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ శ్రమ్ రిజిస్ట్రేషన్ ద్వారా పేదలకు, బడుగులకు, అసంఘ టిత రంగ కార్మికులకు కలగనున్న బీమా, ఇతర ప్రయోజనాలు పొందేందుకు నమోదు కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు బల్ల వెంకటరావు, గుడే నానాజీ, భీమవరపు ప్రకాశరావు, డి.రామకృష్ణ, పతివాడ శ్రీనివాసరావు ఉండపల్లి చంద్ర తదితరులు పాల్గొన్నారు. ముందుగా సంఘ కార్యవర్గ సభ్యులు మేకల ముత్యాలరావు మృతికి సంతాపం తెలిపారు.

నేరాలు ఘోరాలు

గంజాయి నిందితుల అరెస్టు

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధి యారాడ మార్గంలో నిషేధిత గంజాయితో పట్టుబడిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి మల్కాపురం పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శాంతి భద్రతల ఎసిపి బి.మోసెస్‌పాల్ వివరించారు. అందిన సమాచారం మేరకు యారాడ మార్గంలో ఎస్ఐ దేముడమ్మ, సిబ్బందితో కలిసి దాడులు చేశారు. వినయ్, ధర్మారావు, సాయిశంకర్‌ను పట్టుకున్నారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని విచారించగా సంతోష్ ద్వారా గంజాయి రవాణా చేస్తున్నట్లు చెప్పడంతో అతన్ని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సంతోష్‌పై మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. పలు నేరాల్లో నిందితునిగా ఉన్నాడని ఎసిపి తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక గొల్లల తాళ్ళవలస 16వ నెంబరు జాతీయ రహదారిపై రాజుల హోటల్ వద్ద శనివారం రాత్రి తీవ్ర గాయాలతో పడి ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆరిలోవలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారు జామున ఆయన మృతిచెందాడు. భీమిలి ఎస్ఐ తాతారావు కథనం ప్రకారం.. విజయనగరం వైఎస్ఆర్ నగర్ ఎదురుగా ఉన్న సత్యానగర్‌కు చెందిన దంతులూరి శ్రీనివాసరాజు (32) దువ్వాడలోని వసుధార ఫార్మాస్యూటికల్‌లో పదేళ్లగా షిఫ్ట్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటి లాగానే అతని మోటారు బైక్‌పై విజయనగరం వస్తుండగా స్థానిక గొల్లల తాళ్ళవలస, 16వ నెంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో 108లో ఆరిలోవ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్ల వారు జామున మృతిచెందాడు. మృతుని భార్య రేఖా శ్రీకన్య ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ తాతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులం నుంచి 32 మంది ట్రిపుల్ ఐటీకి ఎంపిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎపి గురుకుల బాలికల పాఠశాల నుంచి 32 మంది విద్యార్థినులు రాష్ట్రంలోని నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కోడి రాంబాబు తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీకి 8 మంది, ఒంగోలుకు ఏడుగురు, శ్రీకాకుళానికి 17 మంది ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఆయన అభినందించారు.

మీనామృతంతో ఏపుగా పంటలు

ప్రజాశక్తి -ఆనందపురం: మీనామృతంతో పంటలు ఏపుగా పెరుగుతాయని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి రామారావు తెలిపారు. మీనామృతం దినోత్సవం సందర్భంగా తర్లువాడ పంచాయతీ నగరపాలెం గ్రామ రైతులతో 80 కేజీలు మీనామృతాన్ని ఆదివారం తయారుచేయించారు. చేపల వ్యర్థాలు, సమానంగా బెల్లం తీసుకొని ఒక డ్రమ్ములో పొరలు పొరలుగా వేయించారు. ఈ మిశ్రమాన్ని ఉదయం, సాయంత్రం కర్రతో కలపడం ద్వారా 40 రోజులు తరువాత మీనామృతంగా తయారవుతుందని రైతులకు వివరించారు. 200 లీటర్ల నీటిలో 2 లీటర్ల మీనామృతం కలిపి పిచకారీ చేస్తే పంటల ఎదుగుదలకు, అధిక దిగుబడులకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ చక్రవర్తి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ పైడిరాజు, వెంకటలక్ష్మి, సాయి లక్ష్మి, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

పద్మనాభం : మండలంలోని పొట్నూరు గ్రామానికి చెందిన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మీనామృతం తయారుచేసే విధానాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆర్.మీనా, కె.మోహినిలక్ష్మి వివరించారు. 10 కేజీల చేపల పుట్టు, 10 కేజీల బెల్లం 40 రోజులు పాటు మగ్గపెట్టాలని చెప్పారు. రెండున్నర లీటర్ల ద్రావణాన్ని 100 లీటర్లకు కలిపి పంటపై పిచికారీ చేస్తే పంట అధిక దిగుబడులు సాధించుకోవచ్చని వివరించారు.

పశువైద్య కేంద్రానికి పక్కా భవనం నిర్మించాలి

ప్రజాశక్తి -గాజువాక : శిథిలావస్థకు చేరుకున్న అగనంపూడి పశు వైద్య కేంద్రానికి పక్కా భవనం నిర్మించాలని కోరుతూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు అగనంపూడి అఖిలపక్ష పార్టీల నాయకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, తోకాడ రాము, పిల్లా రవి, ఎస్ శంకరరావు, నిర్మల పాల్గొన్నారు.

సిసి రోడ్డు, డ్రెయినేజీలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెందుర్తి : 92వ వార్డు పరిధి బంటా కాలనీలో సిసి రోడ్డు, డ్రెయినేజీలకు ఎమ్మెల్యే అదీప్‌రాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొద్ది నెలల క్రితం ఇక్కడికి వచ్చినప్పుడు ఈ సమస్యలను గుర్తించి పనులు చేపట్టినట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. వార్డులో సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, హితురాజుల నాగేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాలునిపై వీధి కుక్కల దాడి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు పరిధి పొర్లపాలెంలో బాలునిపై ఆదివారం వీధి కుక్కలు దాడి చేశాయి. చీపురుపల్లి రుత్విక్, మరో బాలుడు కలిసి ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. సమీపంలో ఉన్న నాగరాజు కర్రతో కుక్కలను కొట్టారు. ఆయనపై కూడా దాడి చేశాయి. రిత్విక్ శరీరంపై గాయాలు కావడంతో గోపాలపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు గోపాలపట్నం ఆసుపత్రికి వెళ్లి రిత్విక్‌ను పరామర్శించారు.


రమణికుమారిని అభినందిస్తున్న మాధవ యువజన సమాజం సభ్యులు

ఘనంగా కొత్త మహాలక్ష్మి పండగ

ప్రజాశక్తి -మాధవధార : మాధవ యువజన సమాజం ఆధ్వర్యాన మాధవధారలో కొత్త మహాలక్ష్మి అమ్మవారు పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లూ చేశామని మాధవ యువజన సమాజం నిర్వాహకులు తెలిపారు. కళా హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి, వైసిపి నాయకులు పేడాడ రమణికుమారి, పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్‌గోపాలరావు, సహాయ కన్వీనర్ పప్పల రామచంద్రరావు, ప్రముఖ వ్యాపారవేత్త పేడాడ నరసింహారావు, శ్రీ మాధవ యువజన సమాజం మాజీ అధ్యక్షులు భగవతి శ్రీరామ్మూర్తి, రైల్వే యూనియన్ నాయకులు పప్పల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కుర్చీ వితరణ

ప్రజాశక్తి -మాధవధార : కంచరపాలెంలోని బొట్టా నరసింగరావు ఫౌండేషన్ మెడికల్ ల్యాబ్‌కు నేవల్ డాక్ యార్డులో ఉద్యోగ విరమణ చేసిన గుర్రు అప్పలనాయుడు కుర్చీని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు బిఎన్నార్ ఫౌండేషన్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. బిఎన్ఆర్ ఫౌండేషన్ ప్రజలకు ఉపయోగపడే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ యోగా, కరాటే, కంప్యూటర్ కోర్స్, కుట్టుశిక్షణ, మెడికల్ ల్యాబ్, హోమియో క్లినిక్, ట్యూషన్ సెంటర్, పోటీ పరీక్షల కోచింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు.


కుర్చీని అందజేస్తున్న అప్పలనాయుడు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. శిబిరంలో సుమారు 200 మందికి వైద్యులు సేవలందించారు. 40 మందిని ఆపరేషన్ నిమిత్తం శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ, శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో హౌసింగ్ బోర్డ్ కమిటీ వైద్య శిబిరం నిర్వహించడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో వరాహలక్ష్మీ నరసింహ ట్రస్ట్ మెంబర్ దొడ్డి రమణ, ట్రేడ్ యూనియన్ నాయకులు తాటికొండ జగదీష్, హౌసింగ్ బోర్డ్ కమిటీ జనరల్ సెక్రటరీ ఎం.శ్రీకాంత్, యు.దుర్గారావు, డి.సురేష్, ఆర్.భాస్కరరావు, ప్రతి దేవి, వి.రమణ, ఆర్.రేవతి, గౌరి, గాజువాక సోషల్ మీడియా కో-కన్వీనర్ కల్లూరు సత్యప్రసాద్, గాలి బాబూరావు, సాహుకారి శరత్, సుధాకర్ నాయుడు, కక్కుళ్ళ మురళీ, కుమారస్వామి పాల్గొన్నారు.

గురుకులంలో సమస్యలు తిష్ట

ప్రజాశక్తి-పెందుర్తి : ప్రభుత్వ పాఠశాలలను, హాస్టళ్లను నాడు-నేడు పథకం ద్వారా కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నామని పాలకులు చెబుతున్నా కొన్ని పాఠశాలల్లో మాత్రం సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. కొన్ని పాఠశాలల పరిస్థితి మెరుగ్గా ఉన్నప్పటికీ మేఘాద్రి గెడ్డలోని బాలయోగి గురుకులం పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈ పాఠశాలలో సీటు పొందాలంటే ప్రవేశపరీక్ష రాయాల్సి ఉంటుంది. ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఈ బాలయోగి గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో సుమారు 700 మంది విద్యార్థినులు ఉన్నారు.




పగిలిన మరుగుదొడ్ల టైల్స్

మరుగుదొడ్లు దుర్వాసన

ఈ గురుకులంలో మరుగుదొడ్లు కొన్ని పాడైపోయాయి. టైల్స్ పెచ్చులు ఊడిపోయాయి. వీటి నుంచి దుర్వాసన వస్తోంది.

నిలిచిన క్లీనింగ్ సిబ్బంది

గురుకులం మొత్తానికి ఆరుగురు క్లీనింగ్ సిబ్బంది ఉండేవారు. ఆరు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో వారు మానేశారు. దీంతో నిర్వహణ కళాశాల సిబ్బందికి ఇబ్బందిగా మారింది. అక్కడ చేరిన చెత్తను విద్యార్థినులే క్లీన్ చేయాల్సి వస్తోంది.

తిరగని ఫ్యానులు

విద్యార్థినులుండే చోట ప్రతి గదిలో కనీసం రెండు ఫ్యాన్లు తిరగటం లేదు. ఎండ తీవ్రత, ఉక్క పోతకు తోడు ఫ్యాన్లు తిరగకపోవడంతో విద్యార్థినులు అల్లాడుతున్నారు.

ఊడిన బ్రిక్స్

నాడు- నేడు పథకం కింద ప్రధాన ద్వారం నుంచి కళాశాల వరకు రహదారి వేసి ఇరువైపులా బ్రిక్స్‌ను ఏర్పాటుచేశారు. నాణ్యత లేకపోవడంతో అవి పగుళ్ళు ఇచ్చి ఊడిపోయాయి.

సెక్యూరిటీకి అందని వేతనాలు

ఇక్కడ ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. వారికి కూడా గత కొద్ది నెలల నుంచి వేతనాలు అందడంలేదు. వారు కూడా అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాల, కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విజ్ఞాన మండలి యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -ములగాడ : విజ్ఞానమండలి యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం పంచదార్ల ఎల్లారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఊరుకుటి రాజు, అధ్యక్షులుగా నూనెల నాయుడు, ఉపాధ్యక్షులుగా గొంప శంకర్, కార్యదర్శిగా చట్టి శివకుమార్, జాయింట్ సెక్రెటరీగా పవన్ కల్యాణ్, అదనపు కార్యదర్శిగా నూనెల ప్రసాద్, కోశాధికారిగా ఊరుకూటి యశ్వంత్, సహాయ కోశాధికారిగా నూనెల కృష్ణ, సలహాదారులుగా నూనెల నూకరాజు, నూనెల పైడిరాజు, వై.ఎ.భాస్కరరావు, కిలాని పైడిరాజు, శీర రామకృష్ణ ఎన్నికయ్యారు. కుల పెద్దలు నూనెల అప్పలరాజు, నూనెల చిన్నారావు, నూనెల అప్పారావు, ఎన్.వి.రమణ, ఊరుకూటి అప్పలరాజు, సర్వశుద్ధి పైడిబాబు, వీరు సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. ఈ పాలకవర్గం రెండేళ్లు ఉంటుందని యాదవ సంఘ సభ్యులు తెలిపారు.


ఎన్నికైన పాలకవర్గ సభ్యులు, సలహాదారులు

అసైన్డ్ ల్యాండ్ క్రయవిక్రయాలను పరిమితం చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : అసైన్ ల్యాండ్ భూమికి సంబంధించి క్రయవిక్రయాలు పరిమితం చేయాలని దళిత సేన నాయకులు పాలేటి పెంటారావు, నెక్కల నాగమణి కోరారు. ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఉన్న భూమిలో సగం కంటే ఎక్కువగా అమ్మకాలు జరక్కుండా ఆంక్షలు పెట్టాలని, 12 సంవత్సరాల పాటు సాగు చేస్తున్న దళితులకు సదరు భూమిపై రిజిస్ట్రేషన్ ఛార్జి లేకుండా హక్కు కల్పించాలని కోరారు.

కార్మిక హక్కులు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు కోల్పోతున్న హక్కులను పునరుద్ధరించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జాతీయ ప్రభుత్వ రంగ సంస్థల సమన్వయ కమిటీ పిలుపు నిచ్చింది. బిటి రణదివే భవన్ న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఒ.వి.రావు మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణతో పాటు కార్మిక హక్కుల రక్షణకు బోనస్, ఇఎస్ఐ, నోటీస్ పే వంటివి అమలయ్యేలా చూడాలన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు, కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు పర్మినెంటు, కాంట్రాక్టు కార్మికులు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో రానున్న రోజుల్లో చేయాల్సిన పోరాట కార్యక్రమాలు రూపొందించారని, వాటిని స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులలోకి తీసుకెళ్లి పనిచేస్తామని చెప్పారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో సిఐటియు నాయకులు కెఎం.శ్రీనివాస్, యు.రామస్వామి, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికులకు ఆశా వర్కర్ల మద్దతు

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా నిర్వాసిత కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు ఆదివారం నాటికి 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) బృందం సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు పి.మణి మాట్లాడుతూ, అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. గంగవరం పోర్టు నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన నిర్వాసిత కార్మికుల జీతభత్యాలు అత్యంత దారుణంగా ఉన్నాయన్నారు. జీతాలు పెంచమని కోరితే కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడం దారుణమన్నారు. అదాని యాజమాన్యం కార్మికుల పట్ల మొండి వైఖరి విడనాడి వారి సమస్యలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించాలని కోరారు. లేకుంటే పోరాటం మరింత ఉధృతమవుతుందని, ఈ పోరాటంలో తాము ప్రత్యక్షంగా పాల్గొంటామని చెప్పారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ, అదాని గంగవరం పోర్టు యాజమాన్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండ చూసుకొని కార్మికుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. నోటీసులు పంపించి భయపెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. న్యాయమైన కోర్కెలు పరిష్కరించకపోతే ఉద్యమం మరింత తారాస్థాయికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కనీస జీతం రూ.36 వేలు ఇవ్వాలని, బేసిక్ రూ.22 వేలుగా ప్రకటించాలని, అన్యాయంగా విధుల నుంచి తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు, యూనియన్ నాయకులు వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, పేర్ల నూకరాజు, కదిరి సత్యానందం, గంటిపిల్లి లక్ష్మయ్య, కొవిరి అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న పి.మణి

పంటలకు గిట్టుబాటు ధర కల్పనతోనే / రైతుల ఆత్మహత్యలు నివారణ

- అఖిలపక్ష రైతు సంఘాల సదస్సులో నేతలు
- డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలుకు డిమాండ్
- 25న మునగపాకలో జిల్లాస్థాయి సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతుల ఆత్మహత్యలు నివారించాలని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు మద్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఎ.బాలకృష్ణ అధ్యక్షతన ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ పిఎస్ అజయ్ కుమార్ కన్వీనర్‌గా వ్యవహరిస్తూ అఖిలపక్ష రైతు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, నరేంద్ర మోడీ ఇచ్చిన హామీల అమలు కోసం రెండవ దశ పోరాటం దేశవ్యాప్తంగా ప్రారంభమైందన్నారు. ఇటీవల విశాఖలో జరిగిన కనీస మద్దతు ధరల కమిటీకి రైతు సంఘాలను ఆహ్వానించకపోవడం, రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండా స్టార్ హోటల్స్ లో అధికారులు, అధికార పార్టీ నాయకులు మాత్రమే కూర్చొని కనీస మద్దతు ధరల నిర్ణయించడం సరికాదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

బాలకృష్ణ మాట్లాడుతూ కేవలం 16 పంటలకు మాత్రమే మద్దతు ధర ప్రకటించి, బెల్లంతో సహా అనేక పంటలకు కనీస మద్దతు ధరలు ప్రకటించకపోవడం దుర్మార్గమని, రైతుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని మండిపడ్డారు. ఇప్పటికైనా డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎరువులు విత్తనాలు పురుగుమందులను పిఎసిఎస్‌ల ద్వారా రైతాంగానికి అందుబాటులో ఉంచాలని సమావేశం డిమాండ్ చేసింది. డిమాండ్ల సాధనకు ఈనెల 25వ తేదీన మంగళవారం మునగపాక సహకార బ్యాంకు వద్ద జిల్లా స్థాయి సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కార్యదర్శి ఎం అప్పలరాజు, కోశాధికారి గండి నాయనబాబు, కోరిబిల్లి శంకరరావు, నరాలశెట్టి సత్యనారాయణ, కిసాన్ కాంగ్రెస్ నాయకులు కె.ఏడుకొండలు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు బాలు, గాడి తదితరులు పాల్గొన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి జిల్లావ్యాప్త ఉద్యమాన్ని సమైక్యంగా నిర్మించాలని సమావేశం తీర్మానించింది. అన్ని రైతు సంఘాలను కలుపుకొని ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జరిగే దేశవ్యాప్త ఉద్యమాలను జయప్రదం చేయాలని కూడా సమావేశం తీర్మానించింది.

ఉత్తమ మహిళా పోలీసుకు ఘన సత్కారం



షేక్ జువేరియాను సత్కరిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి - పరవాడ: బాలుడి మిస్సింగ్ కేసును చాకచక్యంగా ఛేధించి ఉత్తమ విలేజ్ మహిళాపోలీసు అవార్డు అందుకున్న మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామ సచివాలయం మహిళా పోలీసు షేక్ జువేరియాను ఘనంగా సత్కరించారు. పరవాడ సిఐ పి.ఈశ్వరరావు సిఫార్సు మేరకు అనకాపల్లి జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ, ఇతర పోలీసు ఉన్నతాధికారులు జువేరియాకు ప్రశంసాపత్రంతోపాటు ఉత్తమ పోలీసు పురస్కారాన్ని అందజేశారు. ఉత్తమ మహిళా పోలీసు పురస్కారం అందుకున్న షేక్ జువేరియాను ఆదివారం ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, తదితరులు దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో. పంచాయతీ కార్యదర్శి జి.సోమునాయుడు, మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, కోఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు

కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టండి

'కాఫీ విత్ కేడర్'లో మాజీ ఎమ్మెల్యే పీలా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

ప్రజాశక్తి-అనకాపల్లి : కొత్త ఓటర్ల చేరికపై టిడిపి శ్రేణులు దృష్టి సారించాలని, ఓటరు వెరిఫికేషన్‌పై అన్ని పోలింగ్ బూత్‌ల్లో బూత్ లెవెల్ కమిటీలను ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. పార్టీ కార్యర్తల కష్టసుఖాలు తెలుసుకోవడానికే నిర్వహిస్తున్న కాఫీ విత్ కేడర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అనకాపల్లి పట్టణంలోని 83వ వార్డు లక్ష్మీదేవి పేటలో కార్యకర్తలతో ముచ్చటించారు. 83వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి బొద్దపు ప్రసాద్, కర్రి గోపి, లక్ష్మీదేవి పేట పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 18ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా చేర్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా వార్డు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నబాబురాజు చర్యలు ఆక్షేపణీయం

వినతిపత్రం ఇచ్చే వారి పట్ల దురుసు ప్రవర్తన అప్రజాస్వామికం : సిపిఎం

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామంలో ప్రజా సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, వెంకటాపురం మాజీ ఉపసర్పంచ్ గనిశెట్టి సత్యనారాయణపై ఎమ్మెల్యే కన్నబాబురాజు దురుసుగా ప్రవర్తించడం దుర్మార్గమని సిపిఎం మునగపాక మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆదివారం మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో విలేకరులతో సిపిఎం నేతలు మాట్లాడుతూ, ఎపుడూ ఏదోఒక వివాదాస్పద చర్యలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా వ్యవహరించడం దుర్మార్గమని, ఎమ్మెల్యే గూండాగిరిని సహించేది లేదని హెచ్చరించారు.

మండలంలో కోకొల్లలుగా ప్రజా సమస్యలు ఉన్నా వాటి పరిష్కారంలో విఫలమైన ఎమ్మెల్యే కన్నబాబు రాజు, ప్రాణాంతకంగా మారిన అనకాపల్లి. అచ్యుతాపురం రోడ్డు పునర్నిర్మించడం చేతకాక ఏనాడో ప్రజా విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. అనకాపల్లి మీదుగా తోటాడ గ్రామానికి రోడ్డు విస్తరణ హామీ నేటికీ అమలు చేయలేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

2013లో పూర్తయిన గవర్ల అనకాపల్లి బ్రిడ్జి నేటికీ ప్రారంభించకపోవడం సిగ్గుచేటన్నారు. వెంకటాపురంలో 94 మందికి ఇళ్ల స్థలాలు ప్రకటించి, నేటికీ ఇవ్వకపోవడంపై ప్రశ్నించిన నేతలపై పరుషంగా మాట్లాడడం ఎమ్మెల్యేకు తగదన్నారు. అచ్యుతాపురం సెజ్‌లోని కంపెనీలకు దళారిగా వ్యవహరిస్తున్న కన్నబాబురాజు బండారాన్ని బయటపెట్టి, ప్రజాబోనులో నిలబెడతామని హెచ్చరించారు. సమావేశంలో ఆళ్ల.మహేశ్వరరావు, ఎస్ బ్రహ్మాజీ, పి సత్యనారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ, టెక్కలి జగ్గారావు పాల్గొన్నారు.

గ్రీన్‌క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం



మొక్కలు నాటుతున్న నాయుడు, సర్పంచ్ అప్పారావు, గ్రీన్‌క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: గ్రీన్‌క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకమని అనకాపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షులు పిజెవి నాయుడు అన్నారు. ఆదివారంస్థానిక ఎస్‌సి కాలనీ మండల పరిషత్ పాఠశాల ఆవరణలో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు నాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాయుడు మాస్టారు మాట్లాడుతూ అందరిని భాగస్వామ్యం చేస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న గ్రీన్ క్లబ్ ప్రతినిధులు అభినందనీయులన్నారు. సర్పంచ్ అప్పారావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణ స్పృహ కలిగి ఉండాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. సేంద్రీయ ఎరువుల వాడకం పెంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహనరావు, వార్డు సభ్యులు కారు లక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ లక్ష్మి, హెచ్‌ఎం శివకోటి దుర్గాప్రసాద్, గ్రీన్‌క్లబ్ గౌరవ సలహాదారు వీరా వినోద్ కుమార్, మల్ల మురళి, ఎస్‌ఎఫ్‌ఐ సత్యనారాయణ, న్యాయవాది ఆశాలత, శేష సాయి, కర్రి హనుమంతరావు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లతో చేయూత



మహిళా మార్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి-సబ్బవరం : మహిళా మార్ట్‌ల ద్వారా మహిళలకు చేయూత లభిస్తుందని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండల కేంద్రంలో రూ.35 లక్షలతో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. మహిళా మార్ట్‌లో తక్కువ ధరకు నాణ్యమైన, ఎంఎన్‌సి కంపెనీలకు చెందిన కిరాణా, ఫాన్సీ వస్తువులు లభిస్తాయన్నారు..సెర్ప్ సిఇఒ మహమ్మద్ ఇంతియాజ్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు ఈ మార్ట్‌ల ద్వారా బ్రాండెడ్ కంపెనీల వస్తువులు అందజేస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. స్త్రీ నిధి ఎండి కెవి నాంచారయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ బి. లక్ష్మిపతి, ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, జెడ్‌పి వైస్‌చైర్మన్ తుంపాల అప్పారావు, వైసిపి నేతలు సబ్బవరపు ముత్యాల నాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, వెలుగు ఎపిఎం సాయి రమేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలం దురాక్రమణపై / జివిఎంసికి లీగల్ నోటీస్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి, గాంధీనగరం, మిరియాల కాలనీ టౌన్ సర్వే నెంబర్ 348లోని మున్సిపల్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని వామపక్షాలు జివిఎంసి ప్రధాన కమిషనర్, అనకాపల్లి జోనల్ కమిషనర్‌కు లీగల్ నోటీసులు పంపించారు. గత నెల 19న వామపక్షాలు వినతిపత్రాలు ఇచ్చినా అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో లీగల్ నోటీసులను ఇచ్చారు.

విశాఖ గ్రంథాలయం తరహా బహుళ ప్రయోజనకారి పౌరగ్రంథాలయాన్ని నిర్మించాలని కోరుతూ వామపక్ష పార్టీల నేతలు ఎ.బాలకృష్ణ, పిఎస్ అజయ్ కుమార్, రాజాన దొరబాబు తదితరులు గతనెల 19న జివిఎంసి ప్రధాన కమిషనర్, అనకాపల్లి జోనల్ కమిషనర్లకు వినతిపత్రాలు ఇచ్చారు. దీనిపై నేటి వరకు ఎలాంటి విచారణ చేపట్టడంగానీ, అక్కడ నిర్మాణాలను నిలిపివేసే చర్యలు చేపట్టకపోవడంతో లీగల్ నోటీసులు పంపించామన్నారు. మిరియాల కాలనీలోని మున్సిపల్ స్థలంలో మున్సిపల్ ఉద్యోగుల కోసం ఎపి హౌసింగ్ కార్పొరేషన్ సహకారంలో ఎల్‌ఐజి కాలనీ కట్టారన్నారు. అందులో కట్టిన గృహాలు ఒక్కొక్కటి 60 చదరపు గజాలకు మించి వుండదన్నారు. 2013లో తమకు అక్కడ 11 సెంట్లు భూమి ఉందని మాజీ మున్సిపల్ ఉద్యోగి కుటుంబ సంభ్యులు రూ.53 లక్షలకు అమ్మివేసారన్నారు. ఈ అమ్మకంలో మున్సిపల్ ఉద్యోగుల పాత్ర, అవినీతిపై విచారణ జరపాలని సిబిసిఐడి, ఎసిబికి ఇప్పటికే వినతిపత్రాలను ఇచ్చామన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో అనకాపల్లి జోనల్ కమిషనర్, జివిఎంసి పట్టణ ప్రణాళిక అధికారుల అధికార దుర్వినియోగంపై విచారణ కోరుతూ లోకాయుక్త వద్ద కేసు దాఖలు చేసామన్నారు. మున్సిపల్ భూమి కబ్జాపై ఈనెల11న అనకాపల్లి వచ్చిన జివిఎంసి కమిషనర్ దృష్టికి తెచ్చినా స్పందించి, చర్యలు చేపట్టకపోవడం ద్వారా ఆక్రమిత స్థలంలో నిర్మాణాలు శరవేగంగా పూర్తిచేసేందుకు అధికారులు లోపాయికారీగా సహకరించినట్లుందని ఆరోపించారు. 2011లో జస్పాల్ సింగ్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును, 2022లో రిట్ పిటిషన్ 108 కేసులో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పులను జివిఎంసి అధికారులు ఉల్లంఘిస్తూ కోర్టు ధిక్కార నేరానికి పాల్పడుతున్నారని నోటీసుల్లో పేర్కొంటూ, దీనిపై 15 రోజుల్లో తమకు జవాబు ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మ శ్రీ

ప్రజాశక్తి-చోడవరం : మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో గ్రీన్‌ఫీల్డ్‌లో భాగంగా స్వయంసహాయక సంఘాల సభ్యులకు ఆదివారం పండ్ల మొక్కలను స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పండ్ల తోటలు పెంచుకునే రైతులకు ప్రభుత్వం రాయితీపై మొక్కల పంపిణీ చేస్తుందన్నారు.ఎంపిపి గాడి కాసు, వైసిపి నేతలు పల్ల నర్సింగరావు, మొల్లి స్వామినాయుడు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



40 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : తాము విద్యాబుద్ధులు నేర్పించిన విద్యార్థులు ప్రయోజకులైతే, వారికి పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులకు కొండంత ఆనందమని పూర్వ ఉపాధ్యాయులు అన్నారు ఆదివారం స్థానిక టిటిడి కల్యాణ మండపంలో దేవరాపల్లి ఉన్నత పాఠశాలలో 1982-83 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది 40 ఏళ్ల కిందట కలిసి ఉన్న వారంతా ఎక్కడెక్కడో ఉన్న ఉపాధ్యాయులను, విద్యార్థులను ఒకేచోట ఆత్మీయ సమ్మేళనంలో చేర్చడం ఎంతో ఆనందకరంగా ఉందని వారంతా అన్నారు. పూర్వ విద్యార్థులు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. సహఫంక్తి భోజనాలు చేశారు. పూర్వ ఉపాధ్యాయులు రొంగలి సత్యం, బిఎ పాత్రుడు, బి అప్పారావు, ఎం సూర్యనారాయణ, వి నాగేశ్వరరావు. కృష్ణ, జిఎస్ సాంబశివరావు, చెల్లారావు మాస్టార్లను సత్కరించి, వారి గ్రామాలకు సాదరంగా సాగనంపారు. కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించిన దేవరాపల్లి పూర్వ విద్యార్థులను, ఉపాధ్యాయులు వారంతా అభినందించారు.

యువతకు క్రికెట్ కిట్ పంపిణీ



క్రికెట్ కిట్ పంపిణీ చేస్తున్న కృష్ణ

ప్రజాశక్తి-కె. కోటపాడు : మండలంలోని గొట్లాం గ్రామ యువతకు మాడుగుల నియోజకవర్గ జనసేన నాయకులు కృష్ణ ఆదివారం క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జనసేనలో చేరికకు అధికసంఖ్యలో యువత ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. అధికార వైసిపి నేతల అక్రమాలను జనసైనికులు ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. మారుమూల గ్రామాల్లో జనసేన సభ్యత్వాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో కుంచ అంజిబాబు, ఉగ్గిన త్రినాథ్, గోల్డ్ గోవిందు మజ్జి ఈశ్వరరావు పాల్గొన్నారు.

పెద్దగెడ్డ ఆక్రమణలను తొలగించాలి

ఆయకట్టు రైతుల ఆవేదన

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీలో ఆక్రమణకు గురైన పెద్దగెడ్డను పునరుద్ధరించి ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని పలువురు రైతన్నలు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పెద్దగెడ్డ వద్ద ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వత్సవాయి రమేష్‌రాజు మాట్లాడుతూ ఆరిపాకలో సర్వే నెంబరు 67లో దురాక్రమణకు గురైన పెద్దగెడ్డ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆక్రమణలను గుర్తించిన రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
వర్షాల సీజన్‌లో లింగాల తిరుగుడు నుంచి పోతుకొండ,



మాట్లాడుతున్న ఆయకట్టు రైతులు



ఆక్రమణలకు గురైన గెడ్డ

నల్లగొండ గెడ్డ వాగులు నుంచి వచ్చే వరద నీరు పెద్దగెడ్డ ద్వారా ప్రవహిస్తుందన్నారు. పెద్దగడ్డ ఆక్రమణకు గురికావడంతో ఆ నీరంతా పొలాల్లోకి పొంగిప్రవహించడంతో పంటలతోపాటు పొలాలకు తీవ్రనష్టం వాటిల్లుతోందని వాపోయారు. దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించి, పెద్దగెడ్డలోని ఆక్రమణలను తక్షణమే తొలగింపు చర్యలు చేపట్టి, ఆయకట్టుకు సాఫీగా సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు. కార్యక్రమంలో ఆయకట్టు రైతులు గొర్లి వెంకటరమణ, ఆడారి నాగరాజు, డి నారాయణమూర్తి రాజు, కర్రి శ్రీరామ్మూర్తి, పెంటకోట రామారావు, ఆదపురెడ్డి పైడం నాయుడు, సోము నాయుడు, లక్ష్మణ, కాకర పెంటారావు, రెడ్డి శ్రీనివాసరావు, గొంప నర్సింగరావు పాల్గొన్నారు.

ఐక్యతతోనే రైతాంగ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- మునగపాక రూరల్: రైతులు, రైతు సంఘాలు సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకోగలమని ఎపి గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డెడ ప్రసాద్, జెడ్‌పిటిసి స్వామి సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక రాహుల్‌గాంధీ కల్యాణ మండపంలో నిర్వహించిన గ్రామ రైతు సంఘం సమావేశంలో జ మాట్లాడుతూ గ్రామంలో తొమ్మిది మూల సంఘాలు, మూడువేల మంది రైతులతో ఏర్పాటైన రైతు సంఘం రాష్ట్రంలోనే పటిష్టమైన సంఘాలలో ఒకటన్నారు. నల్ల బెల్లం, ఏలేరు కాలువ, విద్యుత్ ఛార్జీల ఉద్యమంలో గ్రామ రైతు సంఘం కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. రైతు సంఘం నాయకులు దాడి ముసిలినాయుడు మాట్లాడుతూ రైతుల సమస్యలపై స్పందించి, ఆదుకునే ప్రభుత్వాలకే మనుగడ ఉంటుందన్నారు.

రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక

అనంతరం గ్రామ రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా ఎఎన్‌వి మహేష్, ఉపాధ్యక్షులుగా దాడి శివ, శ్రీకాంత్, కార్యదర్శిగా విల్లూరి నూక నరసింహారావు, సహాయ కార్యదర్శిగా



సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

ఆడారి లక్ష్మణరావు, కోశాధికారిగా ఆడారి అప్పారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు ఎంపిపి మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహనరావు, ఎంపిటిసి సూరిశెట్టి రాము, రైతునేతలు పోలిమేర గణేష్, కాండ్రేగుల జగ్గారావు, సూరిశెట్టి కన్నారావు, ఆడారి కాసుబాబు, టెక్కలి రమణబాబు, వీర కొండలరావు పాల్గొన్నారు.

శాకాంబరిగా నూకాంబిక

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి మూలవిరాట్‌ను ఆషాడమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా వ్యాపారవేత్త మళ్ల జగ్గప్పారావు సహకారంతో వివిధరకాల కూరగాయలు, పండ్లతో శాకాంబరిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇఒ బండారు ప్రసాద్ పాల్గొన్నారు.

మీనామృతంతో అధికోత్పత్తి



కశింకోటలో మీనామృతం తయారీపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : మీనామృతంతో అధికోత్పత్తి తో పాటు చీడపీడల నివారణ అవుతుందని ప్రకృతి వ్యవసాయం మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు అన్నారు. ఆదివారం మండలంలోని పాపయ్య పాలెం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి మీనామృతం వలన పంటలకు కలిగే ఉపయోగాలు, చీడపీడల నివారణ, పంట ఎదుగుదల వంటి అంశాలను వివరించారు. అనంతరం చేపల వ్యర్థాలతోపాటు బెల్లం, నల్లబొగ్గు పొడిని వినియోగించి మీనామృతం తయారీపై రైతులకు వివరించి, ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వియ్యపు పైడికొండ, ప్రకతి వ్యవసాయం మండల ఇన్చార్జ్ మజ్జి సత్యారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట :మండలంలోని తాళ్ళపాలెం రైతులకు ప్రకృతి వ్యవసాయవిధానంలో భాగంగా మీనామృతం తయారీ, దాని వినియోగంతో పంటలకు కలిగే ప్రయోజనాలపై రైతులకు వివరించారు. మండల ఇన్‌చార్జి బత్తిన రమణ మాట్లాడుతూ బెల్లం, చేపల వ్యర్థాలు, కాల్చిన కర్ర బొగ్గు పొడిని సమపాళ్లతో తీసుకుని, తడి తగలని డ్రమ్ము, లేదా సిమెంట్ తొట్టెలో పొరలుపొరలుగా వేసుకుని, ప్రతిరోజూ సాయంత్రం సవ్యదిశలో ఒక కర్రతో తిప్పుతూ ఉండాలన్నారు. ఇలా 25రోజులు చేస్తే మీనామృతం తయారౌతుందని, ఇది పంటలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు చిన్ని కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు

జనసేన నిరసన

ప్రజాశక్తి-చోడవరం : జనసేనాని పవన్ కల్యాణ్‌పై వైసిపి నేతల వ్యాఖ్యలకు నిరసనగా ఆ పార్టీ నియోజవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్.రాజు ఆధ్వర్యంలో ఆదివారం చోడవరంలో నిరసన ధర్నా చేపట్టారు. ముందుగా పార్టీ కార్యాలయం నుండి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తర్వాత కొత్తూరు జంక్షన్ నుండి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు కాలినడకన నడిచి వెళ్లి వైసిపి చేస్తున్న అభ్యంతరకర వ్యాఖ్యలకు నిరసనగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. మరలా కొత్తూరు జంక్షన్‌కు చేరుకుని ప్రదర్శన నిర్వహించారు. మరలా తీవ్ర నిరసన తెలియజేస్తూ నినాదాలు ఇస్తూ మరలా కొత్తూరు జంక్షన్‌కు చేరుకుని మానవహారం చేశారు. వారాహిపాదయాత్ర అఖండ విజయంతో కడుపుమండిన వైసిపి నేతలు వాలంటీర్ల ముసుగులో దుర్మార్గపు వ్యాఖ్యలు చేస్తున్నారని రాజు మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు గూనూరు మురునాయుడు, కర్రి రమేష్, మైచర్ల నాయుడు, డిఎస్ నాయుడు, బలిజ మహారాజు, రామప్పారావు, తుమ్మపాల వీర మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా యానాద్రమ్మ పుట్టుక మహోత్సవం



దర్శనానికి బారులుదీరిన భక్తులు

ప్రజాశక్తి - యలమంచిలి :స్థానిక ఎస్ఆర్ కాలనీలో కొలువుదీరిన యానాద్రమ్మ పుట్టుక మహోత్సవం ఆదివారం వైభవంగా ముగిసింది. రైల్వే గేటు నుండి కాలనీ పొడవునా వేసిన విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారికి పసుపు,కుంకుమ పూజలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేలుళ్లు, నేలవేషాలు, డాన్స్, కోలాటాలు తదితర జానపద కళారీతులతో పండుగ సందడి సాగింది. రాజకీయ నేతలు, పుర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. పోలీసులు గట్టి బందోబస్తు కల్పించారు.

కన్నాలమ్మ జీవనం స్ఫూర్తిదాయకం



చేతిలో గారెల ప్యాకెట్లతో కన్నాలమ్మ

- నలబై ఏళ్లుగా గారెల అమ్మకంతోనే కుటుంబ పోషణ
- నేటికీ ఒక రూపాయికే ఒక గారె విక్రయం
- కాలినడకనే ఊరూరా తిరుగుతూ అమ్మకం

ప్రజాశక్తి- కశింకోట : కాస్త వయస్సు పైబడిన వెంటనే డీలా పడిపోయి, పరాధీనమైపోతున్న నేటితరానికి కన్నాలమ్మ జీవనం ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకమనే చెప్పాలి. కశింకోట మండలం శింగవరం గ్రామానికి చెందిన నంబారు కన్నాలమ్మ ఆరున్నర పదుల వయస్సులోనూ ఊరూరా తిరుగుతూ, గారెల అమ్మకం ద్వారానే నేటికీ జీవనం సాగిస్తోంది. అన్నిరకాల వస్తువుల ధరలు మండిపోతున్నా, నేటికీ రుపాయికే ఒక గారె విక్రయిస్తూ, గారెల కన్నాలమ్మగా ప్రసిద్ధి చెందింది.
ప్రతిరోజూ ఉదయాన్నే గారెలను తయారు చేసి, పది గారెలను ఒక కవరులో పెట్టి, ఆ కవర్లన్నింటినీ ఒక బకెట్‌లో ఉంచి కాలినడకనే ఊరూరా తిరుగుతూ విక్రయిస్తోంది. ఉదయం 11గంటలకు గారెల కవర్లున్న బకెట్ పట్టుకుని ఇంటి నుంచి బయలుదేరి, తాళ్ళపాలెం జంక్షన్, ఉగ్గినిపాలెం జంక్షన్, పరవాడ పాలెం, జమౌదులపాలెం, బయ్యవరం, కశింకోట జాతీయ రహదారిపై వెళ్తున్న వారికి గారెలను అమ్ముతూ జీవనం సాగిస్తోంది. 'గారెలు పదికి పది, ఇరవైకి ఇరవై' అంటూ పిలిచి మరీ గారెలను అమ్ముతోంది. కన్నాలమ్మ గారెలను అనేక మంది ఇష్టంగా తింటుండగా, కొందరు ఆమె కష్టాన్ని చూసి ఇష్టం లేకపోయినా గారెలను కొంటున్నారు. అలాగని ఉత్తినే ఎవరు డబ్బులు ఇచ్చినా తీసుకోకుండా తన ఆత్మాభిమానాన్ని చాటుకుంటోంది. దీనిపై ఎవరైనా కన్నాలమ్మను అడిగితే, 40ఏళ్లుగా గారెలు వండి అమ్ముతున్నాను. వాటిని తయారుచేసి, కాలినడకనే వెళ్లి విక్రయించడమంటే తనకెంతో ఇష్టమని, తన తనువు ఉన్నంతవరకు ఎవరిపైనా ఆధారపడకుండా జీవనం సాగించాలన్నదే తన ఆశయమని ఎంతో గర్వంగా చెబుతోంది. ఎంత లాభం వచ్చిందనే దానికంటే, ఎంతమందికి గారెలను అమ్ముతున్నానన్నదే చూస్తున్నానని అంటోంది. సొంతకాళ్లపైనే నిలబడడమే కాకుండా కుటుంబపోషణకు అండగా ఉంటున్న గారెల కన్నాలమ్మ జీవితం నేటి తరానికి ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకమనే చెప్పాలి.

బీడు బారుతున్న భూములు

-అప్పు చేసి దేవుడు మాన్యం భూముల సాగు - పెట్టుబడి రాక ముందుకు రాని రైతులు

ప్రజాశక్తి-గొలుగొండ:రైతులు సాగు చేసేందుకు ముందుకు రాకపోవడంతో దేవుడు మాన్యం భూములు బీడు బారుతున్నాయి. గొలుగొండ మండలం దారమఠం దారమల్లేశ్వరస్వామి, లింగంపేటం నూకాలమ్మ ఆలయాలకు చెందిన భూములకు మూడేళ్లకోసారి కౌలు వేలం నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది మూడు సార్లు వేలం పిలిచినా ఆ భూములను సాగు చేసేందుకు రైతులు ఎవరూ ముందుకు రాలేదు. మూడేళ్లుగా పెట్టుబడి ఖర్చులూ రాకపోవడంతో దేవాదాయ శాఖకు అప్పు చేసి ఏటా శిస్తు చెల్లించామని పలువురు రైతులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మాన్యం భూములను కౌలుకు తీసుకొని ఇంకా అప్పులు చేయలేమంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దారమఠం ఆలయం భూముల్లో తాటిమొక్కలు

దారమల్లేశ్వరస్వామి ఆలయానికి 26 ఎకరాల విస్తీర్ణంలో పల్లపు భూములు ఉన్నాయి. వీటిని 11 భాగాలుగా చేసి కౌలుకు ఇస్తున్నారు. తద్వారా ఏటా రూ.2.4లక్షలు ఆలయానికి ఆదాయం వచ్చేది. ఈ సొమ్ముతో నిత్యం స్వామి వారికి పూజలు, పూజారి వేతనం, మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించేవారు. ఈ ఏడాది భూములు కౌలుకు తీసుకునేందుకు రైతులెవరూ ముందుకు రాకపోవడంతో పూజా కార్యక్రమాలు, ఉత్సవాల నిర్వహణకు నిధులు ఎలా అన్న మీ మాంశలో పడ్డారు.



బీడుగా మారిన లింగంపేట మాన్యం భూమి

లింగంపేట నూకాలమ్మ ఆలయానికి 37 ఎకరాల మెట్ట భూమి ఉంది. వీటిని ఏడు భాగాలు చేసి కౌలుకు ఇస్తున్నారు. ఏటా రూ.1.4 లక్షల కౌలు రూపేణా ఆదాయం వస్తోంది. ఈ మొత్తంతో కొత్త అమావాస్య జాతరను ఘనంగా నిర్వహించే వారు. గత ఏడాది శిస్తు డబ్బులు చెల్లించకలేక కౌలు రైతులు భూములను వదిలేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఈ ఏడాది సాగు చేసేందుకు ముగ్గురే ముందుకొచ్చారు. ప్రస్తుతం 20.60 ఎకరాల భూమి బీడుగా ఉంది.

మరోసారి వేలం

ఈ విషయమై దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి రామకృష్ణను వివరణ కోరగా దారమఠం, లింగంపేట ఆలయాలకు చెందిన భూములకు మూడు విడతలుగా వేలం నిర్వహించామని, కౌలు చేసేందుకు రైతులు ఎవరూ ముందుకు రాలేదన్నారు. మరోసారి వేలంకు పిలుస్తామని, ఎవరూ రాకపోతే పరిస్థితిని వివరిస్తూ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. వారి సూచనల మేరకు తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.

జగనన్న కాలనీకి దారేదీ?

-మార్గం లేక ముందుకు సాగని గృహ నిర్మాణ పనులు

ప్రజాశక్తి -కోటవురట్ల:ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీకి దారి లేకుండా పోయియింది. జల్లూరు గ్రామంలో సర్వే నెంబర్ 122లో 0.50 ఎకరాలు దాదాపు ఎకరా 20 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ కాలనీలో 21 మంది లబ్ధిదారులను సైతం ఎంపిక చేశారు, కాలనీకి వెళ్లేందుకు దారి లేక ఎవరూ నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాలేదు. గృహాలు నిర్మించుకునేందుకు దారి లేక మెటీరియల్ ఎలాగు తీసుకు వెళ్లాలో అర్థం కాక నిర్మాణాలు చేపట్ట లేక పోతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులు ముందుచూపు కొరవడిందని, కాలనీకి వెళ్లేందుకు దారిలేని స్థలం కొనుగోలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని పేర్కొన్నారు. కొనుగోలు చేసి సుమారు రెండు సంవత్సరాల కావస్తున్నా నేటికీ కాలనీ స్థలానికి వెళ్లే దారి చూపలేకపోయారని లబ్ధిదారులు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి కాలనీకి వెళ్లే దారి చూపాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు.



ఇదే జగనన్న కాలనీ

చోరీల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి- పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట గ్రామంలో ఏఎస్ఐ గోవిందరావు అధ్వర్యంలో దిశ యాప్, అసాంఘిక కార్యకలాపాలు, చోరీల నియంత్రణపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల సమాచారంను పోలీస్‌లు వెంటనే చెర వేయాలన్నారు.కార్తికేయ కళాశాలలో సైబర్ నేరాలు, స్త్రీలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులలో టోల్ ఫ్రీ నెంబర్లు 100, 112లకు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ స్పాట్ ఇన్చార్జి హెచ్‌సికె శ్రీనివాసరావు, సిబ్బంది భరతుడు, దేవందర్, సర్పంచ్ అప్పలనరస, కార్తికేయ కళాశాల ప్రిన్సిపాల్ స్వామి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మీనామృతంపై అవగాహన

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని పెట్టుగొల్లపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం లో భాగంగా మీనామృతం తయారీ విధానంపై అనకాపల్లి జిల్లా డిపిఎం లచ్చన్న, ఎన్ఎఫ్ఏ శ్యామల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. తయారు చేసిన మీనామృతాన్ని పంటకి ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. రైతులు మీనామృతాన్ని తయారు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ సాగు పద్దతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రాము, లావణ్య, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

10వ రోజుకు రిలే దీక్ష

ప్రజాశక్తి-కోటవురట్ల:అణుకు గ్రామానికి పాఠశాల, రహదారి సౌకర్యం కల్పించాలని గిరి పుత్రులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం 10వ రోజుకు చేరుకుంది. రహదారి, పాఠశాల లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతూ ఉండడంతో గిరి పుత్రులు పది రోజులుగా రిలే నిరాహార దీక్ష చేపడు తున్నారు. రహదారి లేక నిత్యావసర వస్తువులు, అత్యవసర పరిస్థితిలో రోగులను తరలించేందుకు అవస్థలు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డేవిడ్ రాజు, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.



దీక్ష చేపడుతున్న గిరిజనులు



మాట్లాడుతున్న దేముడునాయుడు

'మధ్యాహ్న' కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి- చీడికాడ: ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సిఐ టియు నేత ఆర్.దేముడునాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎంపీపీ స్కూల్ వద్ద ఆదివారం మధ్యాహ్నం భోజన పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు జి వరలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేముడు నాయుడు మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలన్నారు. కార్మికుల తొలగింపులు ఆపాలని, విద్యార్థులకు మెనూ చార్జీ పెంచాలన్నారు. గ్యాస్, వంట పాత్రల సామగ్రి ప్రభుత్వ సరఫరా చేయాలన్నారు. ఈ సమస్యలపై ఈనెల 31న అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు షేక్ బేబీ, ఎస్కే వహీదా, వై లక్ష్మి, జి.దేవి, జి.రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిత

మహిళలకు టిడిపి అధిక ప్రాధాన్యత

- మాజీ ఎమ్మెల్యే అనిత

ప్రజాశక్తి -పాయకరావుపేట:తెలుగుదేశం పార్టీ తొలి విడత మేనిఫెస్టోలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని మాజీ శాసనసభ్యులు, వంగలపూడి అనిత తెలిపారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ, తల్లికి వందనం పథకంలో భాగంగా చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి ప్రతి సంవత్సరం 15000 రూపాయలు ఇవ్వడం జరుగు తుందన్నారు.సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 సంవత్సరాలు దాటిన మహిళలకు ప్రతినెల రూ.1500, నిరుద్యోగ భృతికి ప్రతినెలా 3000 అందజేస్తామన్నారు. రైతులకు ప్రతి సంవత్సరం 20000 రూపాయలు అందజేస్తామని తెలిపారు. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో వైఎస్ఆర్ ప్రభుత్వం ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిసెట్టీ వెంకటేష్, అబద్ధం, జానకి శ్రీను పాల్గొన్నారు.

పవన్‌ను విమర్శించడం తగదు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను విమర్శించే అర్హత సినీ సైడ్ ఆర్టిస్ట్ జోగినాయుడికి లేదని ఆ పార్టీ నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ విమర్శించారు. ఆదివారం పవన్ కళ్యాణ్ పై జోగినాయుడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 'పవన్ కళ్యాణ్ ఎంత రెమ్యూనేషన్ తీసుకుంటే నీకు ఎందుకని... ఆయన తీసుకున్న కష్టాన్ని కౌలు రైతులకు అందిస్తున్నారన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు'. పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడి పాపులర్ అవుదామని అనుకుంటున్నావా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, కళలు క్రియేటివ్ హెడ్ గా ఉన్న జోగినాయుడు ఇప్పటి వరకు ఏమి చేశారో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు ఇన్చార్జ్ శివ తదితరులు పాల్గొన్నారు.

నేతల హామీలు నీటిమూటలు

- కొండెక్కిన కొంతసంత మినీ రిజర్వాయర్ - నాలుగేళ్లయినా పట్టించుకోని ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి-రోలుగుంట:గత నాలుగు శతాబ్ధాలుగా ఈ ప్రాంత రాజకీయ నాయకులు ఎన్నికల ముందు కొండ సంత పణుకు పడగొడతా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని హామీల వర్షం కురిపించడం ఓటర్లతో చప్పట్లు కొట్టించడం పరిపాటిగా మారింది. కొంతసంత మినీ రిజర్వాయర్ ఏర్పాటుపై 2019 ఎన్నికల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎంకె.పట్నం శివారు గ్రామాలైన పెదపేట, శింగరాజుపేట, బిబి.పట్నం, రత్నంపేట, ఒడ్డిప, బుచ్చంపేట, రోలుగుంట గ్రామాల్లో హామీ ఇచ్చారు. గెలిచిన వెంటనే మొదటి సంతకం పెడతానని హామీ కూడా ఇవ్వడం పట్ల ఆయా గ్రామాల్లో ఇప్పుడు విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగేళ్లు పూర్తి అయినా పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. చింతపల్లి మండలం తాజంగి రిజర్వాయర్ లీకేజీ నీరు కొండ సంత మీదుగా వృథాగా పోతుందని, దానికి అడ్డంగా ఒక పణుకు ఉందని, ఆ పణుకును తీసేస్తే దానిని ఆనుకొని ఉన్న రోలుగుంట మండలం రెవెన్యూ ప్రాంతానికి నీరు వస్తుంది. మండల పరిధిలో నీరు నిల్వ చేయడానికి ట్యాంక్ ఏర్పాటు చేస్తే సుమారు 20వేల ఎకరాలకు నీరు అందుతుంది. అదనపు నీటిని మాకవరపాలెం మండలానికి సరఫరా చేయవచ్చు. ఈ రిజర్వాయర్ ఏర్పాటు చేయకపోతే కనీసం ఎంకె.పట్నం రెవెన్యూ పరిధిలోని చాకలిపణుకు వద్ద కొండగెడ్డకు చెక్‌డ్యామ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు రైతులు అంటున్నారు. దీనిపై కూడా ఎమ్మెల్యే శ్రద్ధ చూపించలేదు. లిఫ్ట్ ఇరిగేషన్ అయినా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కనీసం చెక్‌డ్యామ్ నిర్మించినా సుమారు 2వేల ఎకరాలకు నీరు అందుతుందని కొందరు అంటున్నారు. చాకలి పణుకు వద్ద చెక్‌డ్యాం నిర్మించి ఎంకె.పట్నం రెవెన్యూ పరిధిలోని పెద్ద చెరువు నుండి మాలచెరువు నుండి బిబి.పట్నం పక్షులవాని ట్యాంకుకు నీరందిస్తే పలు గ్రామాలు సస్య శ్యామలం అవుతాయని పలువురు అంటున్నారు.



వృథాగా పోతున్న నీరు



రిజర్వాయర్ నిర్మించాల్సిన ప్రాంతం

హామీ నెరవేర్చాలి

హామీలు ఇవ్వడం కాదు నెరవేర్చడానికి సంకల్పం ఉండాలి. ఈ ప్రాంతానికి చిరకాల కోరిక మండల ప్రజలకు ఎక్కువ శాతం న్యాయం జరుగుతుంది. అటు దానిపై కనీసం దృష్టి సారించకపోవడం మంచిదికాదు. 2003లో అప్పటి ఎమ్మెల్యే, చిన్ననీటి పారుదలశాఖ మంత్రి బలిరెడ్డి సత్యారావు సర్వే చేయించి, కొంత ప్రయత్నం చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం ఈ విషయాన్ని మర్చిపోయారు.

మడ్డు సత్యనారాయణ (గైరమ్మ)

హామీ కార్యరూపం ఏదీ?

గెలిచిన వెంటనే మొదటి సంతకం ఈ మినీ రిజర్వాయర్ పై పెడతానని ఎమ్మెల్యే ధర్మశ్రీ హామీ ఇవ్వడం జరిగింది. ఇప్పటికీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీంతో నీరు అందలేదు.



కె.సత్యనారాయణ, రైతు, కొంతలం

రిజర్వాయర్ నిర్మించాలి

ఎమ్మెల్యే ధర్మశ్రీ రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేస్తానని ప్రతీ గ్రామంలో హామీలు ఇచ్చారరు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు ఏళ్లు అవుతున్నా ఆ హామీలు నీటముటలయ్యాయి.



సుర్ల రామకృష్ణ, ఎంపిటిసి, రోలుగుంట

చెక్‌డ్యాం అయినా నిర్మించాలి

కనీసం చెక్‌డ్యాం అయినా నిర్మాణం చేస్తే 2వేల ఎకరాలకు నీరు అందుతుంది. ఎన్నికల ముందు హామీలు ఇస్తారు. తీరా మర్చిపోతారు.



ఈరెల్లి చిరంజీవి, సిపిఎం నాయకులు



మాట్లాడుతున్న జోగినాయుడు

సిఎంపై మర్యాదగా మాట్లాడాలి

- సినీ నటుడు జోగినాయుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గణేష్‌తో కలిసి సినీ నటుడు, సాంస్కృతిక కళా క్రియేటివ్ హెడ్ జోగినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో ఆదివారం మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రిని సంభోదించే తీరును పవన్ కళ్యాణ్ మార్చుకుంటే మంచిదని తెలిపారు. సినిమా ఇండస్ట్రీకి 'మీరు చేసింది ఏమీ లేదని, కోట్ల రూపాయలు రేమ్యునిరేషన్ తీసుకుంటున్నట్టు మీరే చెప్పారని, ఏదో ఉద్ధరిస్తాం అన్నట్టుగా ఉత్తి మాటలు చెప్పడం దేనికని వ్యాఖ్యానించారు. జనసేన పార్టీ పెట్టి పది సంవత్సరాలు అవుతున్నా ఎందుకు రాజకీయంగా ఎదగలేదన్నారు. ఇప్పుడైనా ఆత్మ పరిశీలన చేకోవాలని సూచించారు. పవన్ కళ్యాణ్ సంస్కారవంతంగా మాట్లాడటం నేర్చు కోవాలని, ఆవేశంతో ఊగిపోతూ నోటికి ఏది వస్తే అది మాట్లాడటం సరికాదన్నారు. పది సంవత్సరాల పాటు కష్టపడి, ప్రజల మధ్య ఉండి రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్ ఎదిగారని, ఆయనపై విమర్శలు చేసేటప్పుడు సంస్కారవంతంగా మాట్లా డాలన్నారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

586వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి:హెటిరో కంపెనీ రెండవ పైపులైన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 586వ రోజుకు చేరింది. శిబిరం వద్ద ఆదివారం మత్స్యకారులు పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. పైపులైనుకు వ్యతిరేకంగా 586 రోజుల నుండి ఆందోళన చేస్తున్నప్పటికీ నేటి వరకు సమస్య పరిష్కారానికి మార్గం చూపకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే కంపెనీ వ్యర్థ జలాలు సముద్రంలో వదలడంతో మత్స్య సంపద నశించి తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త పైపులైను ఏర్పాటు చేస్తే తమ మనుగడ ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైపులైన్ ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు.న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు . ఈ కార్యక్రమంలో మత్స్యకారులు గోసల స్వామి, చేపల సోమేష్, పిక్కి కాశీ, పిక్కి గంగరాజు, గురయ్యా, నూకరాజు, కారే భూలోక, పిక్కి సత్తిరాజు, మైలపల్లి నల్ల, పిక్కి రమణ, ఉమ్మిడి నూకరాజు, బొంది నూకరాజు, దేవుడు, కొడ కాశీ, ఏపీ మత్స్యకార జెఎసి రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పిక్కి స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అల్లూరి యూత్ మండల అధ్యక్షుడు కే సూర్య ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గతంలో చాపరాయి నిర్వహణకు అధికారులు టెండర్ పాట నిర్వహించే వారని, ఈ ఏడాది నుంచి టెండర్ పాట నిర్వహించకుండా ఐటీడీఏ నిర్వహణ కొనసాగిస్తుందన్నారు. స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అధికారులు ప్రకటించి సుమారు ఐదు మాసాలు గడుస్తున్నా కల్పించక పోవడంతో ఆందోళనకు గురవుతున్నారన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-మాడుగుల:అంతర్జాతీయ చెస్ పోటీలకు మాడుగుల విద్యార్థులు అర్హత సాధించారు. ఈనెల 8,9 తేదీలలో నెల్లూరులో జరిగిన చెస్ పోటీలకు మాడుగుల వీనస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తాలపు రెడ్డి నాగ చంద్ర వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. ఈ పోటీలలో న్యూజిలాండ్, యుఎస్ఎ, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలు పాల్గొన్నాయి. ఇందులో 2.5 పాయింట్లు పొందితే ఫైడ్ ఐడి ఇవ్వబడి, తదుపరి పోటీలలో పాల్గొనేందుకు అవకాశం వుంటుంది. ఈ పోటీల్లో మాడుగుల విద్యార్థులు బొడ్డు ప్రదీప్ 4 పాయింట్లు, మోల్లి రంజిత్ కుమార్ 3, పిన బోయిన యువరాజు 3, పినబోయిన ప్రదీప్ చంద్ర 2. 5 పాయింట్లు సాధించి, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. వీరు కొద్ది కాలంగా వీనస్ కోచింగ్ సెంటర్ వద్ద శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు విద్యార్థులకు ధృవపత్రాలు పంపిణీ చేసి, భవిష్యత్ లో దేశం తరపున ఆడి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. వీరికి ఆర్థిక ప్రోత్సాహం మొవ్వ బుచ్చయ్య చౌదరి, జల్లు విశ్వేశ్వరరావు సతీమణి మీనాక్షి, భారత నిర్మాణ సేన అందించారు. ఈ కార్యక్రమంలో వీనస్ కోచింగ్ నిర్వాహకుడు తాలపురెడ్డి నాగచంద్ర, మొవ్వ బుచ్చయ్య చౌదరి, భారత నిర్మాణ సేన ప్రతినిధి గౌరీపట్టపు మహేష్‌కుమార్ పాల్గొన్నారు.



సత్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

తప్పని డోలీ మోత

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో గొట్టువాడ శివారు గిరిజన గ్రామమైన అణుకు ప్రాంతానికి చెందిన తంగేళ్ల రమ్య ఆదివారం రాత్రి ప్రసవ వేదనతో అవస్థలు పడింది. దీంతో, గిరిజనులు అణుకు నుండి ఐదు కిలోమీటర్ల మేర గ్రామస్తులు డోలి మోతతో గొట్టువాడ ప్రధాన రహదారి వద్దకు తీసుకువచ్చారు, అక్కడి నుంచి 108 సహాయంతో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్కు గర్భిణీని తీసుకొచ్చి హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. రహదారి సక్రమంగా లేక పోవడంతో అత్యవసరం పరిస్థితిలో డోలీ మోతతో ఆసుపత్రికి రావాల్సి వస్తుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.



గర్భిణిని డోలీలో ఆసుపత్రికి తరలిస్తున్న బంధువులు



ఏర్పాటు చేస్తున్న వీధి లైటు

వీధిలైట్ల ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జోగం పేట గ్రామ పంచాయతీలో సర్పంచ్ జువ్వల లక్ష్మి, ఉప సర్పంచ్ స్వామినాయుడు ఆధ్వర్యంలో మరమ్మత్తులకు గురైన వీధి లైట్ల స్థానంలో కొత్త లైట్లు అమర్చారు. త్వరలో లైట్ల మరమ్మత్తుకు పంపించి లైట్లు లేని వద్ద అమర్చుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జువ్వల దేముడు పాల్గొన్నారు.

కార్మికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భవన నిర్మాణ కార్మికుడు కొర్ర శ్రీను విశాఖపట్నం కేజీహెచ్ లో అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు అరకువేలి మండల కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు, చిరు వ్యాపారస్తులు సహకారంతో ఇరవై మూడు వేలు సేకరించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, తేజవలీ, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గోపి, సహాయ కార్యదర్శి దాసు, రాజేంద్ర, కొండలరావు చేతులు మీదుగా అందించారు.



నగదు ఇస్తున్న నాయకులు